ప్రజాశక్తి
గురువారం 18 జనవరి 2024
5
శ్రీకాకుళం

నేడు సామాజిక సమతా సంకల్పం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

125 అడుగుల భారతరత్న బి.ఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ సందర్భంగా సామాజిక సమతా సంకల్ప సమావేశాన్ని ఈనెల 18న నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.45 గంటలకు బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలాలంకరణ, మానవహారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించే సామాజిక సమతా సంకల్ప సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, పలు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గడప దాటని పనులు

- రూ.80.53 కోట్లతో 2,685 పనులకు పాలనా అనుమతులు
- ఇప్పటివరకు 14.84 కోట్ల విలువైన 479 పనులే పూర్తి
- పనులపై ఎన్నికల ప్రభావం
- పాత పనులకు బిల్లులు రాకపోవడం మరో కారణం

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అందులో భాగంగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో విస్తృతంగా సచివాలయాలు సందర్శించేలా నిరంతరం పర్యవేక్షించింది. సచివాలయాల సందర్శనలో వెనుకబడిన ప్రజాప్రతినిధులపై ప్రత్యేక దృష్టిసారించి వారికి హెచ్చరికలు సైతం జారీ చేసింది. జిల్లాలో ఉన్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులందరూ తమ పరిధిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజాప్రతినిధులు పర్యటనల స్థాయిలో వారు ప్రతిపాదించిన పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. గతంలో పనులు చేపట్టిన వారికి బిల్లులు రాకపోవడంతో వైసిపి స్థానిక నాయకులెవరూ ముందుకు రావడం లేదు. పైగా ఎన్నికల సంవత్సరం కావడంతో పనులు చేయడానికి వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల అనంతరం ఒకవేళ ప్రభుత్వం మారితే బిల్లులు రావని భావిస్తున్న నాయకులు, పనులకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మెళియాపుట్టి మండలంలో వీరన్నపేట-గొట్టిపల్లి రహదారి దుస్థితి

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు, అందిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఇంటినీ ఎమ్మెల్యేలు సందర్శించేలా ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 2022 మే 11న ప్రారంభించింది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని అన్ని ఇళ్లకూ వెళ్లాలని ప్రజాప్రతినిధులను ఆదేశించింది. ఇందులో భాగంగా వారు పర్యటించిన ప్రాంతాల్లో మౌలిక వసతులు, కనీస సౌకర్యాల కోసం సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయిస్తూ 2022 ఆగస్టు 17న జిఒ నంబరు 123 విడుదల చేసింది. పనుల గుర్తింపు, మంజూరు, నిర్వహణ, పర్యవేక్షణపై ప్రత్యేక మార్గదర్శకాలను వెలువరించింది. అందుకనుగుణంగా జిల్లాలో గతేడాది ఆగస్టు నుంచి ఎమ్మెల్యేలు సచివాలయాల సందర్శన మొదలుపెట్టారు. జిల్లాలో 732 సచివాలయాలు ఉండగా అందరూ కలిపి 650కి పైగా సచివాలయాలను సందర్శించారు. ప్రజాప్రతినిధుల నుంచి ఇప్పటివరకు 2,685 పనులకు సంబంధించి మాత్రమే ప్రతిపాదనలు రాగా వాటికి అనుమతులు పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. వీటికి రూ.80.53 కోట్ల మేర పరిపాలనా అనుమతులు జారీ చేశారు. ఇప్పటివరకు రూ.14.84 కోట్ల విలువైన 479 రకాల పనులు పూర్తయ్యాయి. మరో 1294 పనులు ప్రగతిలో ఉన్నాయి.

పనుల మంజూరులో సాంకేతిక ఇబ్బందులు

పనుల మంజూరుకు కొన్నిరకాల సాంకేతిక కారణాలూ ఉన్నాయి. సచివాలయాల వారీగా గుర్తించిన పనుల జాబితాను ఎంపిడిఒలు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు పంపుతున్నారు. వాటిలో నిబంధనల ప్రకారం ఉన్న పనులకు ఉన్నతాధికారులు అనుమతులు జారీ చేస్తున్నారు. లేని పక్షంలో పెండింగ్‌లో ఉంచుతున్నారు. ఈ కారణంతో పనుల్లో కొంత జాప్యం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పనులపై ఎన్నికల ప్రభావం

గడప గడపకూ పనులను గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలతో పాటు స్థానిక వైసిపి నాయకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. పనులు చేస్తున్నా సకాలంలో బిల్లులు రావడం లేదని వారు చెప్తున్నారు. దీంతోపాటు గతంలో ముఖ్యమంత్రి డెవలప్‌మెంట్ నిధులు (సిఎండిఎఫ్)తో పనులు చేసినా, ఆ డబ్బులు ఇప్పటివరకు రాలేదు. గడప గడపకూ మన ప్రభుత్వం పనులు ముందుకు సాగకపోవడంపై ఎన్నికల ప్రభావం కొంతపడినట్లు చర్చ నడుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో చేపట్టిన పనులకు ఇప్పుడు బిల్లులు రాకపోతే తర్వాత వస్తాయో, లేదోనన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వం మారితే గతంలో టిడిపి నాయకుల పరిస్థితే తమకూ ఎదురవుతుందని అనుకుంటున్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు ఇప్పటికీ కొందరికి డబ్బులు రాలేదు. దీంతో కొత్తగా డబ్బులు మదుపు పెట్టడానికి ఎవరూ సాహసించడం లేదు. ఫలితంగా పనులు ముందుకు సాగడం లేదు.

శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ప్రయాణికుల రద్దీ

తిరుగు ప్రయాణంతో పెరిగిన రద్దీ

- ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బారులు తీరిన జనం
- టిక్కెట్ ధరలు పెంచిన ప్రైవేట్ ట్రావెల్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చిన వారు తిరుగు పయనమవుతున్నారు. దీంతో శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ కిక్కిరిసిపోయింది. పలు ప్రాంతాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఎక్స్‌ప్రెస్, సూపర్ డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసులతో పాటు సాధారణ బస్సులను ప్రత్యేక బస్సులుగా నడుపుతున్నారు. పండగకు వచ్చిన వారిలో అత్యధికం ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి తిరుగు పయనమవుతారు. రైల్వే రిజర్వేషన్లు ముందుగానే అయిపోవడంతో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. దీంతో బస్సులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన వారితో శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ నిండిపోయింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్‌టిసి జిల్లా నుంచి పలు ప్రాంతాలకు 260 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అవసరమున్న అన్ని రూట్లలో బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. ఈనెల 21వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

ప్రైవేటు ట్రావెల్స్ దందా

పండగ రద్దీని ప్రైవేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. గతంలో విజయవాడకు రూ.600 నుంచి రూ.700 మధ్య టిక్కెట్టు వసూలు చేస్తే, ఇప్పుడు డిమాండ్‌ను బట్టి రూ.1500 నుంచి రూ.రెండు వేల వరకు ఉంది. హైదరాబాద్ వంటి ప్రాంతాలకు మామూలు రోజుల్లో రూ.2,400 ఉన్న టిక్కెట్‌ను బుధవారం రూ.3,500కు పెంచారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్ తీసుకున్నా అదే ధర వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులపై అదనపు భారం పడుతోంది.

అస్సాం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జిల్లావాసి

ఏప్రిల్‌లో బాధ్యతలు స్వీకరించనున్న కోత రవి

ప్రజాశక్తి - నౌపడ

అస్సాం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంతబొమ్మాళి మండలం కోటపాడుకు చెందిన కోత రవి నియమితులయ్యారు. ఈమేరకు అస్సాం ప్రభుత్వ విభాగం మంగళవారం అధికారిక ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుతం ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న పవన్ కుమార్ బోర్తకూర్ పదవీకాలం ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగియనుంది. ఆయన తదనంతరం రవి బాధ్యతలు చేపట్టనున్నారు. కోత రవి 1993 ఐఎఎస్ బ్యాచ్ అధికారి. అతను ప్రస్తుతం అస్సాం ప్రభుత్వంలో హోం, పొలిటికల్ డిపార్ట్‌మెంట్ విభాగ అదనపు చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, పాస్‌పోర్ట్, జైళ్ల తదితర విభాగాల్లో పనిచేసి మంచి గుర్తింపు సంపాదించుకున్నారు.

కోటపాడుకు చెందిన కోత అప్పోజీ, సన్యాసమ్మ మూడో సంతానం రవి. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఆరు నుంచి పదో తరగతి వరకు మండలంలోని దండుగోపాలపురం హైస్కూల్‌లో సాగింది. ఇంటర్మీడియట్ టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, బాపట్లలో అగ్రికల్చర్ బిఎస్‌సిని పూర్తి చేశారు. ఎంఎస్‌సి ఎంట్రన్స్‌లో ఐఎఆర్‌ఐలో నాలుగో ర్యాంకు సాధించారు. ఢిల్లీలో పిహెచ్‌డి చేశారు. 1992లో మొదటిసారి సివిల్స్‌లో 252 ర్యాంకు సాధించారు. రెండోసారి 1993లో 48వ ర్యాంకు సాధించారు. 1993లో ఐఎఎస్‌గా ఎంపికైన ఆయన ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి అత్యున్నత పదవులు చేపట్టారు. పలువురు ప్రభుత్వాధినేతల మన్ననలను పొందారు. అమెరికాలోని భారత దౌత్య కార్యాలయంలో ఆర్థికవేత్తగానూ పనిచేశారు. కోత రవి తండ్రి అప్పోజి 27 ఏళ్ల పాటు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. రవి పెద్ద సోదరుడు కోత భీమారావు ఎపి హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. రెండో సోదరుడు కోత మధుసూదనరావు కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. అస్సాం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రవికి టెక్కలి ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, కోటపాడు సర్పంచ్ కోత ఇందిరమ్మ, కోత సతీష్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన నుంచి గతేడాది డిసెంబరు 9 వరకు వచ్చిన క్లయిమ్‌ల పరిశీలన పూర్తయిందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. ఈనెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌ఒ ఛాంబరులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 28వ వారపు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలకు సంబంధించి పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేశామన్నారు. వాటితో సంబంధం లేకుండా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు దరఖాస్తు చేసుకునే వారి మార్పులు, చేర్పుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతూ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అతి ప్రాముఖ్యమైనదని, ఓటు విలువ తెలియజేసి పోలింగ్ శాతం పెంచేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. సమావేశంలో వైసిపి నాయకులు ఎస్.సత్యనారాయణ, టిడిపి నాయకులు కె.వి రామరాజు, బిజెపి నాయకులు పి.సురేష్‌బాబు, బిఎస్‌పి నాయకులు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

25 నాటికి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

అధికారులకు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

సార్వత్రిక ఎన్నికలకు గానూ జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, సదుపాయాల కల్పనలో అధికారులు ఎలాంటి అలసత్వం వహించరాదని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఈనెల 25వ తేదీ నాటికి పెండింగ్‌లో ఉన్న పనులను శత శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తి చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,357 పోలింగ్ కేంద్రాలకు గానూ 711 కేంద్రాల్లో ఇంకా సంతృప్తికర స్థాయిలో ఏర్పాట్లు లేవని గుర్తించామన్నారు. ఆయా కేంద్రాల్లో ఫర్నిచర్, మంచినీరు, మరుగుదొడ్లు, వికలాంగులకు వీలుగా ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్ సరఫరా తదితర అంశాల్లో లోటుపాట్లను సరిదిద్దాల్సి ఉందన్నారు. ఆయా కేంద్రాల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. సీనియర్ సిటిజన్లు, వికలాంగులకు ఎలాంటి కష్టం లేకుండా ఓటు వేసేందుకు కల్పించాల్సిన సౌకర్యాలపై సూచనలు చేశారు. ఎన్నికల విధులకు కేటాయించిన అధికారులు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలను సక్రమంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణను అధికారులు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా నిర్వహించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులకు విధులను కేటాయించడం జరుగుతుందని, ఈ విధులను నిబంధనల ప్రకారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును వక్రీకరిస్తున్నారు

- నిరాధార ఆరోపణలతో చంద్రబాబుపై కేసులు
- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చంద్రబాబు నాయుడు క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పును వైసిపి నాయకులు వక్రీకరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు పిటిషన్‌పై ఇద్దరు న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలు మాత్రమే వ్యక్తం చేశారని గుర్తుచేశారు. సెక్షన్ 17ఎ అవినీతి నిరోధక చట్టం 1988ను స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు వర్తింపజేయడంపై ఇద్దరు న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో తదుపరి చర్యల కోసం ప్రధాన న్యాయమూర్తికి నివేదించారని తెలిపారు. 2018 జూన్ 5న ఎసిబికి అందిన లేఖ దర్యాప్తు కోసం పంపిన విజ్ఞాపన మాత్రమేనని, దర్యాప్తుపై నిర్దిష్టమైన ఆర్డర్ కాదన్నారు. ఈ కేసులో నిధులు దారిమళ్లినట్టు గానీ, చంద్రబాబుకు తిరిగి ఆ నిధులు వెళ్లినట్టు గానీ ఎక్కడా ఆధారాలు చూపలేదన్నారు. అవినీతి నిరోధక చట్టం సవరణ ద్వారా వచ్చిన సెక్షన్ 17ఎ అమలుకు ముందు చంద్రబాబుపై ఏ రకమైన విచారణ, దర్యాప్తు, పరిశోధన జరగలేదని చెప్పారు. న్యాయస్థానంలో ఇదే అంశం ప్రస్తావనకు వచ్చిందన్నారు. కేవలం ఉద్దేశపూరక్వగా కక్షసాధింపు ధోరణితో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిఐడిని తన జేబు సంస్థగా వాడుకుని కేసులు పెట్టారని ఆరోపించారు. తుది తీర్పు సానుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంగన్వాడీల అలుపెరుగని పోరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరింది. సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు అలుపెరుగని పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. సమ్మెలో భాగంగా జ్యోతిరావు పూలే పార్కు వద్ద సమ్మె శిబిరంలో పొర్లు దండాలు పెడుతూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మె సమంజసమైందని, నాలుగేళ్లుగా అనేక రకాలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో చట్టబద్ధంగా సమ్మె చేపట్టారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోతే జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ జిఒ నంబరు 2ను ప్రభుత్వం జారీ చేయడం, నోటీసులు ఇస్తూ బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. అంగన్వాడీలకు ఎస్మా వర్తించదని తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి మాట్లాడుతూ అంగన్వాడీలు 37 రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీని అమలు చేయాలన్నారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచుతామన్న ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.ప్రకాష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు సిహెచ్.అరుణ, వై.లీలారత్నకుమారి, డి.ముత్యమ్మ తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో బస్టాండ్ కూడలి వద్ద ఎండలో కూర్చొని నిరసన తెలిపారు. ప్రభుత్వ బెదిరింపు చర్యలకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు హైమ, బాలామణి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో సమ్మె శిబిరంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడారు. ఉద్యోగ, ప్రజాసంఘాల నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఆర్.ఆదిలక్ష్మి, బి.రమణమ్మ, ఇందుమతి, హెచ్.వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు. సరుబుజ్జిలిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఎండలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

శ్రీకాకుళం అర్బన్ : పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

సరుబుజ్జిలి : సంతకాలను సేకరిస్తున్న అంగన్వాడీ

అంబేద్కర్ విగ్రహావిష్కరణ చారిత్రాత్మకం

ఎస్‌సి కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అమరావతిలో ఈనెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చారిత్రక కార్యక్రమమని ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల ఎత్తు గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రూ.400 కోట్లతో నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. దీంతోపాటు అంబేద్కర్ స్మృతివనం, లైబ్రరీ, ధ్యాన మందిరం తదితర భవనాల నిర్మాణం పూర్తయిందన్నారు. అంబేద్కర్ ఎస్‌సి, ఎస్‌టిలకే పరిమితం కాదని... దేశ ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, పౌరులకు హక్కులను ప్రసాదించిన రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. అంబేద్కర్ చేసిన కృషి, త్యాగం అనిర్వచనీయమన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ ఆర్ అండ్ బి అతిథిగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఈనెల 21వ తేదీ వరకు సెలవులో ఉన్నందున, అప్పటివరకు ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్‌నాయక్

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్ ఆదేశించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రెవెన్యూ. ఎంపిడిఒ ఇతర ఎన్నికల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 299 పోలింగ్ స్టేషన్లు క్షుణ్ణంగా తనిఖీ చేసి ర్యాంప్, మరుగుదొడ్లు, తాగునీరు, లైటింగ్, ఫర్నిచర్ పూర్తిస్థాయిలో ఉండాలని ఎంపిడిఒ, ఎంఇఒలకు ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లు అన్ని సదుపాయాలతో ఈనెల 31 నాటికి సిద్ధం చేయాలన్నారు. అనంతరం "ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయిలో ఆటలు ఇచ్ఛాపురం పట్టణంలో చేపట్టాలని, ఈ నెల 24 నుంచి మొదలవుతాయని, అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆదేశించారు. నాలుగు మండలాల మండలస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి క్రీడలు ఆడుతున్న సమయంలో భోజనం, వసతి సదుపాయాలు, మెడికల్, పోలీస్ సహకారంతో దిగ్విజయంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ గురు ప్రసాద్, డిటి శ్రీహరి, రెవెన్యూ, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో పలువురు టెక్కలి నియోజకవర్గ వైసిపి నాయకులు, వార్డు మెంబర్లు, గ్రామవాలంటీర్లు టిడిపిలో చేరారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో బుధవారం మండలం మూలపేట గ్రామం నుంచి వార్డు మెంబర్ మూల సింహాచలం, బమ్మిడి ఉత్తరరావు, బమ్మిడి కృష్ణ తదితరులతో పాటు 50 కుటుంబాలు టిడిపి చేరాయి. అలాగే కొత్తపల్లి పంచాయతీ నుంచి వార్డు మెంబెర్ వెలమల వెంకటరావు, కొత్తపల్లి గ్రామ వాలంటీర్ వాన ప్రవీణ్‌లు టిడిపిలో చేరారు. నియోజకవర్గంలో అచ్చెన్నాయుడు అభివృద్ధి తప్ప వైసిపి చేసిందేమి లేదన్నారు. నందిగాం మండలం కాపుతెంబూరు పంచాయతీ నుంచి మాలపల్లి సింహాచలం, మాలపల్లి గంగాధర్‌రావు, మాలపల్లి అప్పలరాజు, పోలాకి తిరుపతిరావు, కుమ్మరి కాళిదాసుతో పాటు 40 కుటుంబాలు టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి అచ్చెన్నాయుడు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

రక్తదానం చేస్తున్న మహిళలు

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తం నాయుడు అన్నారు. బుధవారం మండలంలో కనుగులవలసలో దివంగత డిసిసిబి మాజీ డైరెక్టర్ బొడ్డేపల్లి రామ జోగినాయుడు శతజయంతి వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని చౌదరి పురుషోత్తం నాయుడు ప్రారంభించారు. ఈ శిబిరంలో పలువురు మహిళలు పాల్గొని రక్తదానం చేసారు. అనంతరం గ్రామంలో పెద్ద సంఖ్యలో మొక్కలను నాటారు. సామాజిక కార్యక్రమాల నిర్వహణ అభినందనీయమని డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు అన్నారు. శత జయంతి వేడుకల్లో భాగంగా రామ జోగినాయుడు కుటుంబానికి చెందిన నాలుగు తరాలకు చెందిన సుమారు 200 మంది సకుటుంబ సపరివార సమేతంగా ఆత్మీయంగా కలిశారు. కార్యక్రమంలో చౌదరి తేజేశ్వరరావు, సంపూర్ణమ్మ, చౌదరి రవీంద్ర, సతీష్, బగాది రాజగోపాలరావు, బొడ్డేపల్లి అనిల్, నిరంజన్, నితిన్, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు ప్రారంభం

సోంపేట: మండలంలోని కర్తల్లిపాలెం, పోత్రకొండ గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను బుధవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో నూతన శకానికి సిఎం జగన్మోహన్ రెడ్డి నాంది పలికారన్నారు. సచివాలయ వ్యవస్థతో సమస్యల పరిష్కారానికి మంచి మార్గమన్నారు. ప్రజలందరూ సచివాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన జగన్మోహన్ రెడ్డిని మరలా ఆదరించాలన్నారు. అలాగే జగతికేశుపురంలో నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి నిమ్మన దాసు, నాయకులు బి.మోహనరావు, రౌతు విశ్వనాథం, శిలగాన భాస్కరరావు, సర్పంచ్‌లు గున్నయ్య, కగేశ్వరరావు, ఎంపిటిసిలు నాగేశ్వరరావు, గణపతి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

కవిటి: జింకిబద్రలో జనవరి 14 నుంచి 16 వరకు జరిగిన జిల్లాస్థాయి నాన్ మెడలిస్ట్ బ్యాడ్మింటన్ పోటీల్లో కవిటికి చెందిన బెందాళం మణికంఠ, తెలుకల అజయ్ ప్రథమ బహుమతి, మొగలిపురి దినేష్, బెనర్జీ ద్వితీయ బహుమతి కైవసం చేసుకుని సత్తాచాటారు. ఈ సందర్భంగా వారికి జిల్లా బ్యాడ్మింటెన్ ఉపాధ్యక్షుడు తమరాల జయరామ్, ఉషోదయ గౌరవాధ్యక్షుడు బెందాళం చిట్టిబాబు, అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, బ్యాడ్మింటెన్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ లోళ్ల రాజేష్, ఉపాధ్యక్షుడు బెందాళం రమేష్, మాజీ సర్పంచ్ ఆరంగి మధుబాబు, ఉషోదయ మాజీ అధ్యక్షుడు పొల్లాయి లక్ష్మణమూర్తి, ఆరంగి రాజు, బెందాల రంగారావు, కార్యదర్శి పులకల వెంకటరావు, జాతీయ బ్యాడ్మింటెన్ అంపైర్ శరత్, రాష్ట్ర అంపైర్ జన్ని భరత్, సీనియర్ క్రీడాకారులు రవి, జయప్రకాష్, అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

రణస్థలం రూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తానని ఎపి మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొత్తకోట్ల లక్ష్మి అన్నారు. ఆమెకు ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా నియమించడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఆమెకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కష్టపడి పనిచేస్తానని, తనపై నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించిన పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకి, రాష్ట్ర మహిళ అధ్యక్షరాలు లాంతాంతియా కుమారి, వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి పి.రాకేష్ రెడ్డి, శ్రీకాకుళం డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

గురమ్మ పేరంటాలను దర్శించుకున్న ఎమ్మెల్యే

లావేరు : మండలంలో గుర్రాలపాళెం గ్రామంలో గురమ్మ పేరంటాలు 54వ వార్షికోత్సవం సందర్భంగా జాతర కార్యక్రమాలు గత మూడురోజులుగా జరుగుతున్నాయి. చివరి రోజు బుధవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

మెళియాపుట్టి : పూర్వపు విద్యార్థుల కలయిక



పొందూరు : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల పరిధిలో పెద్దలక్ష్మిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003-2004 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఒకరిని ఒకరు కలుసుకొని వారి కుటుంబాల పరిస్థితులను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమ సహ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే వారికి అందరూ కలిసికట్టుగా ఆర్థిక సహాయం అందిస్తామని, అలాగే పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎవి.రమణమూర్తి, విశ్రాంత హెచ్‌ఎం నిత్యానంద సాహు, డిగ్రీ కళాశాల లెక్చరర్ కొండాల చత్రపతి, ధర్మాన కృష్ణవేణి, బంధన శ్రీనివాసరావు, నక్క సంపత్ కుమార్, పద్మనాభం, కె. మురళీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: వారంతా కొన్ని ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆలింగనాలూ చేసుకున్నారు. ఆడారు. పాడారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించి తమ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన గురువులను సన్మానించుకున్నారు. అలనాటి తమ చిలిపి చేష్టలు, మధుర జ్ఞాపకాలను తలచుకుని ఆనంద సాగరంలో తేలియాడారు. 1990-91, 2006-07 పదో తరగతి విద్యార్థుల ఈ అపురూప కలయికకు బొరివంక, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వేదికయ్యాయి.

పొందూరు: మండలం పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 2019-20 నుంచి 2022-23 వరకు చదివిన మూడు సంవత్సరాల విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొని సందడి చేశారు. పాఠశాలలో గడిపిన మదుర క్షణాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు ఆర్థికసాయం చేసేందుకు ముందుకు వస్తామని ఉపాధ్యాయులకు తెలియజేశారు. సమావేశంలో సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుగ్గు కాసులబాబు, ఉపాధ్యాయులు జి.వి.రమణరావు, తమ్మినేని మురళీమోహన్, ఎన్.రవిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఉన్నత విలువలతో కూడిన విద్య అవసరమని వివేక వర్ధిని స్కూల్ అధ్యాపకుల వలనే వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నామని 2000-01 పదోతరగతి పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. బుధవారం నగరంలో ప్రైవేటు హోటల్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో నాటి గురువులను గుర్తు చేసుకుంటూ గత స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. 23 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు ఒకరినొకరు పలకరించుకున్నారు. కార్యక్రమంలో నరసింహమూర్తి, శివ, డాక్టర్ రఘు, ఆనంద్, రాజమోహన్, స్వాతి, మాలతి, ప్రణీత, లీలారాణి, అమరావతి, కళ్యాణి, గణపతి, సురేష్ పాల్గొన్నారు.

కవిటి : 1990-91 పదో తరగతి బ్యాచ్ కలయిక

వజ్రపుకొత్తూరు: గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1988-89 పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించారు. చదువుకున్న రోజుల్లో తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమతో చదువుకున్న పేరాడ తిలక్ రాజకీయంగా వైసిపిలో పార్లమెంటరీ ఇన్‌ఛార్జిగా నియమితులవ్వడంపై స్నేహితులు అభినందనలు తెలిపారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడు బ్రెయిన్ డెడ్ కావడంతో బుధవారం ఆయన కుటుంబసభ్యులు అవయవదానానికి అంగీకరించారు. వారి అనుమతి మేరకు జెమ్స్ వైద్య కళాశాలలో యువకుడి నుంచి కిడ్నీ, లీవర్, కళ్లకు శస్త్రచికిత్స చేసిన వైద్యులు వాటిని సజీవంగా వేర్వేరు ఆస్పత్రులకు పంపించారు. బ్రెయిన్ డెడ్ అయిన యువకుడు నందిగాం మండలం మాదిగాపురం గ్రామానికి చెందిన రోణంకి రవికుమార్ (28)గా వైద్యులు తెలిపారు. విశాఖపట్నంలో ఫిట్టర్‌గా ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న ఆయనకు తల్లిదండ్రులు రోణంకి నారాయణరావు, నారాయణమ్మ, సోదరుడు రాజశేఖర్ ఉన్నాడు. ప్రస్తుతం గల్ఫ్‌లో రాజశేఖర్ ఫిట్టర్‌గా పని చేస్తుండగా రవికుమార్ విశాఖలో ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన రవికుమార్ ద్విచక్రవాహనంపై పలాస వెళ్లి వస్తుండగా బెండిగేటు ప్లైఓవర్ వద్ద ఈనెల 10న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. రవికుమార్‌ను శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. అచేతన స్థితిలో ఉన్న రవికుమార్ సాధారణ స్థితికి వచ్చే అవకాశం లేదని వైద్యులు నిర్ధారించడంతో కుటుంబసభ్యులు అవయవ దానమిచ్చేందుకు అంగీకరించారు. దీంతో బుధవారం శస్త్రచికిత్స నిర్వహించి కిడ్నీలతో పాటు లివర్‌ను విశాఖపట్నంకు తరలించారు. కళ్లను రెడ్‌క్రాస్ నేత్రాలయాలనికి అందించారు. ఆయనకు జెమ్స్ వైద్యులు, సిబ్బంది, కుటుంబసభ్యులు ఘనంగా వీడ్కోలు తెలిపారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్టు జెమ్స్ వైద్యులు తెలిపారు.

కోటబొమ్మాళి : మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

ప్రజా భాగస్వామ్యంతోనే పల్లెల అభివృద్ధి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రజాభాగస్వామ్యంతోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని అసిస్టెంట్ కలెక్టర్ రఘువేంద్ర మీనా అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజులు పాటు జరిగిన జిపిడిపిపై మండలస్థాయి శిక్షణా కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు వారాలు పాటు ఎంపిడిఒ విధులను తెలుసుకొనేందుకు ఇక్కడకు రావటం జరిగిందన్నారు. పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక బడ్జెట్లను తయారు చేసుకోవాలన్నారు. ఉపాధి కల్పన, ఆర్థిక ప్రణాళిక, తదితర కమిటీల ద్వారా గ్రామసభలు ఏర్పాటు చేసి పల్లెలను అభివృద్ధి పర్చుకోవాలన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి గ్రామస్థాయిలో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలన్నింటిని కార్యదర్శి ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఎంపిడిఒ బి.రామారావు, ఎఒ రాజేశ్వరమ్మ, కార్యదర్శులు ఎన్ఎన్. చైతన్య, బి.నరేష్‌లకు మండల ప్రొఫైల్, సచివాలయ సంఖ్య తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల విప్ బొడ్డు అప్పన్న, ఎఎంసి వైస్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ, చిట్టేవలస సర్పంచ్ సంపతిరావు వెంకటరమణ, పేడాడ వెంకటరావు ఉన్నారు.

నందిగాం: గ్రామాల అభివృద్ధిపై సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రాజారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఎంపిపి పాల్గొని మాట్లాడారు. జిపిడిపి కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయం, ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన నిధులు, రాబోయే ఏడాది ప్రణాళిక తయారు చేసుకొని నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మాజీ జెడ్‌పిటిసి కింతల ధర్మారావు, వైస్ ఎంపిపి రేగల లక్ష్మీకాంతం, సువ్వారి వసంత కుమార్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ ఇమాన్యుల్ రాజు

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ టి.ఇమాన్యుల్ రాజు తెలిపారు. ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఇచ్ఛాపురం రూరల్, అర్బన్ స్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించడం వలన ఈ ప్రాంతంలో అన్ని గ్రామాలు, వార్డులపై పట్టుందన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయం కావడంతో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో సమావేశాలు, అసాంఘిక కార్యకలాపాలకు ప్రత్యేక నిఘా పెట్టడం జరుగుతుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. వికెపేట స్టేట్‌బ్యాంక్ రోడ్‌లో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ గోవిందరావు, కవిటి ఎస్ఐ రాము ఉన్నారు.

ఫిబ్రవరి 18 నుంచి కమ్మసిగడాం జాతర

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఉత్తరాంధ్ర ఇలవేల్పు కమ్మ సిగడాం శ్రీ మహాలక్ష్మి తల్లి జాతర ఫిబ్రవరి 18 నుంచి 20 వరకు మూడు రోజులు జరగనుందని ఆలయకమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలో కమ్మసిగడాంలో శ్రీ మహాలక్ష్మి తల్లి కమ్మవారి కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర సక్రమంగా జరిపించేందుకు జాతర మేనేజ్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి జాతరకు సంబంధించి పలు అంశాలు చర్చించారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు వెలిచేటి రామకృష్ణ, వి.రాజరవిచంద్ర, వి.తేజ, వి.రాజశేఖర్, రాయుడు, మన్నె లక్ష్మి ప్రసాద్, వెలిచేటి మురళీ, సిహెచ్‌వి.రాజేష్, మన్నె కృష్ణానందం, తాతీయులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలుకు కృషి చేయాలి

వజ్రపుకొత్తూరు: దుర్గ్ నుంచి విజయనగరం మీదుగా పలాస, బరంపురం వరకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్ర ఉత్కల్ సంఘర్ష్ సమితి సభ్యులు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును బుధవారం నిమ్మడలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చం నాయుడును రైలు సమస్యపై సహకరించాలని కోరారు. త్వరలోనే రైల్వే మంత్రితో సమావేశమై చర్చిస్తానని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రైల్వే మంత్రిని కలిసేందుకు ఢిల్లీకి రావాలని ప్రతినిధులకు తెలపడంతో ఆంధ్ర ఉత్కళ సంఘర్ష్ సమితి భిలాయి, ఛత్తీస్‌ఘఢ్ అధ్యక్షుడు కర్రి ఉమాశంకరరావు, మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, గణపతి, కాస పాపారావు, పల్లేటి బాలు, పల్లేటి తిరుపతిరావు హర్షం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా కొత్త రైలును నడపాలని ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులను కలిసినా ఇంతవరకు సమస్యకు పరిష్కారం కాలేదన్నారు.

ఆడుదాం ఆంధ్రా బృహత్తర కార్యక్రమం

నందిగాం : వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి శ్రీరామమూర్తి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఆడుదాం ఆంధ్ర ఒక బృహత్తరమైన కార్యక్రమమని వైసిపి పార్లమెంటరీ ఇన్‌ఛార్జి పీరాడ తిలక్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ హైస్కూల్ గోవిందపురంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రికెట్ సెమీఫైనల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడల పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. యువత క్రీడలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైసిపి నాయకులు రామారావు, కొరికాన వాసు, సింహాచలం, హెచ్‌ఎం హరిబాబు, పిఇటి నాగరాజు ఉన్నారు.

నందిగాం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ సెమీ ఫైనల్ పోటీలను నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సువ్వారి వసంత కుమార్, రేగల లక్ష్మీకాంతం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిడిఒ రాజారావు, జెసిఎస్ కన్వీనర్ జె.జయరాం, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, కణితి నారాయణమూర్తి, బార్నాన బాలకృష్ణ, మడపాల సంజీవరావు, తమిరి రాజు, తమిరి దేవేంద్రరావు, కూన శాంతారావు, కవిటి ఎర్రన్న, బోలుబద్ర సోమేశ్వరరావు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో రైతు సమస్యలపై పోరాటం

ఇచ్ఛాపురం: నియోజకవర్గంలో రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీరు సమస్యల పరిష్కారం కోసం సమిష్టి కృషితో సాధించేందుకు చర్యలు తీసుకుంటామని తీర్మానించారు. బుధవారం పట్టణంలో ఎల్లమ్మగుడి వద్ద నియోజకవర్గ స్థాయి రైతుకుల సంఘం ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. రైతుకుల సంఘం కన్వీనర్ జన్నెలా ప్రసాదరావు అధ్వర్యంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించి రైతాంగ ప్రతినిధులు పాల్గొని సాగునీరు సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చలు జరిపారు. వంశధారనది నీరును ఇచ్ఛాపురం వరకు తీసుకొచ్చే ప్రయత్నం చేయాలని, అందుకు అందరం సమిష్టిగా కృషి చేయాలన్నారు. అందులో భాగంగా ఈ నెల 24న కంచిలి మండలంలో భారీస్థాయిలో రైతుల సమావేశం ఏర్పాటుకు సమావేశం నిర్ణయించింది. కార్యక్రమంలో కుర్మారావు, నరేంద్ర యాదవ్, మంగి గణపతి, పండి దేవ్, లోహి దాసు రెడ్డి, డాక్టరు శివాజీ, కాళ్ల ధర్మారావు, బి.కామేష్ రెడ్డి, దక్కత విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న రైతు కుల సంఘం ప్రతినిధులు

దుస్తులు పంపిణీ

టెక్కలి: సమాజంలో మనిషి ఎంతటి ఉన్నత స్థానాన్ని అదిరోహించినా తమ సంఘంలో ఉన్న వారిని ఆదుకునేందుకు అవసరమైన ఔదార్యం ఉండాలని పట్టుశాలీ సంక్షేమ సంఘ గౌరావాధ్యక్షులు దుంపా లోకేశం అన్నారు. పట్టుశాలీ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో బుధవారం భావనామహర్షి జయంతి వేడుక అక్కపువీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విశ్రాంత ఇంజనీరింగ్ అధికారి పమ్మిన సింహచలం దంపతుల సౌజన్యంతో సంఘంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షులు మల్లిపెద్ది మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ కార్యదర్శి దుంపా శ్రీనివాస్, దున్న సాంబశివరావు, బస్వా శ్యాంసుందరరావు, దున్న రామకృష్ణ, అట్ల వెంకటేశ్వరరావు, బుడ్డు నందికేష్, డి.మోహనరావు, దండా సుద, ఆచ్యుతరావు, రఘునాధరావు పాల్గొన్నారు.

దుస్తులు అందజేస్తున్న సింహాచలం

పలువురికి పరామర్శ

శ్రీకాకుళం అర్బన్: మండలం తంగివానిపేటలో ఇటీవల మృతి చెందిన అంజి మేస్త్రీ తల్లి వంకాల సూరమ్మ కుటుంబాన్ని వైసిపి నాయకులు ధర్మాన రాంమనోహర నాయుడు పరామర్శించారు. బుధవారం ఆమె ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శిమ్మ శ్రీకాంత్ కుటుంబసభ్యులను పరామర్శించారు. నగరంలో బగ్గు సరోజని ఆస్పత్రిలో ధనం ప్రసాద్, మెడికవర్‌లో గజలక్ష్మిలు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని తెలుసుకొని ఆస్పత్రికి వెళ్లి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు తంగి అప్పన్న, బగ్గు అసిరినాయుడు, దశరథ, పల్ల శ్రీరాములు, పొన్నాడ ఋషి, గోవింద్ ఉన్నారు.

పలువురిని పరామర్శించిన శంకర్

అలాగే శ్రీకూర్మం గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన దుంగ రమణ సతీమణి మహాలక్ష్మిని బుధవారం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ పరామర్శించారు. బొద్దానపేటలో అనారోగ్యం బారిన పడ్డ పల్ల సాయి కుమార్‌ను పరామర్శించారు. అనంతరం వనుమువాని పేటలో ఇటీవల మృతి చెందిన పిట్ట అప్పమ్మ కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈయన వెంట టిడిపి నాయకులు మైగాపు ప్రభాకర్, దసుమహంత్ మధవేశ్వరరావు, యాళ్ల నాగరాజు, పట్నాన మహేష్, పల్ల పెంటయ్య, బర్ల రాజు, ఊట తవిటిరాజు, కలగ అప్పన్న, వనుము రమణ పాల్గొన్నారు.

పాన్‌షాపులో చోరీ

ప్రజాశక్తి- పలాస

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ రోడ్డులో కె.శ్రీరాములు అనే వ్యాపారికి చెందిన పాన్‌షాపులో మంగళవారం రాత్రి దొంగలు తాళాలు విరగ్గొట్టి షాపులో ఉన్న రూ.5వేలు నగదుతో పాటు రూ.15వేలు విలువైన వస్తువులు దొంగిలించినట్లు బాధితుడు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసారు. బుధవారం షాపు తెరిచేందుకు రాగా తాళాలు విరగొట్టినట్లు గుర్తించారు. అనంతరం తెరిచి చూడగా నగదు, వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించి ఆవేదన వ్యక్తం చేశారు. షాపు ప్రాంతంలో ఉన్న సిసి కెమెరాలో దొంగతనం దృశ్యం కనిపించింది. సిసి పుటేజీ ఆధారంగా దొంగలకోసం పోలీసులు వెతుకుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టిడిపి ఫ్లెక్సీలు చించివేత

ప్రజాశక్తి- పలాస

చించివేసిన ఫ్లెక్సీ

మండలం కిష్టుపురం గ్రామంలో వైసిపి అల్లరి మూకలు టిడిపి ఫ్లెక్సీలను చించివేశారు. వైసిపికి చెందిన కొంతమంది నాయకులు, కార్యకర్తలు టిడిపి ప్రభుత్వంలో ఇచ్చే పథకాలను తెలియజేస్తూ బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ ఫ్లెక్సీ, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసే ఫ్లెక్సీలు చించివేసి ఆనందం పొందారు. టిడిపి నాయకులు బూరెల కృష్ణంరాజు, విజయ్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు, నాయకులు ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. ఇటువంటి చర్యలతో టిడిపి విజయాన్ని అడ్డుకోలేరని హెచ్చరించారు.

ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాదం

టెక్కలి రూరల్: టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెల రేగాయి. ఉదయాన్నే పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థులు దీనిని గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనా స్థలంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రధానోపాధ్యాయులు నాగభూషణరావు సమాచారం తెలిసిన వెంటనే పాఠశాలకు చేరుకుని చూసేసరికి స్టోరూంలో ఫర్నిచర్ కాలిపోయినట్లు తెలిపారు.

కాశీబుగ్గ రూరల్ సిఐగా ఈశ్వరరావు

పలాస : కాశీబుగ్గ రూరల్ సిఐగా పి.ఈశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం డిఎస్‌పి నాగేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన సిఐ శంకరరావు అనకాపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. పరవాడ పోలీస్‌స్టేషన్‌లో సిఐగా పని చేస్తున్న ఈశ్వరరావు కాశీబుగ్గ రూరల్ పోలీసు స్టేషన్‌కు నియమించారు. బాధ్యతలు చేపట్టిన సిఐ ఈశ్వరరావుకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బూర్జ: మండలం పెద్దపేట గ్రామ సమీపంలో విశాఖపట్నం నుంచి కొత్తూరు వెళ్తున్న ప్రైవేటు అంబులెన్స్, బూర్జ మండలం పాలవలస గ్రామం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు, ఎస్ఐ అశోక్ బాబు వివరాల మేరకు పాలవలస గ్రామానికి చెందిన అల్లుబోయిన చంద్రశేఖర్, రామన్నపేటకు చెందిన లావేటి నవీన్ శ్రీకాకుళం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు గమనించి వెంటనే 108 సహకారంతో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయాలవ్వడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఎస్ఐ అశోక్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

జూదరుల అరెస్టు

కొత్తూరు: మండల కేంద్రంలో కొత్త కొత్తూరు శివాలయ పరిసరాల్లో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ ఎం.ఎ. అహమ్మద్ సిబ్బందితో వెళ్లి దాడిచేసి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.10, 600 స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

16 మందిపై కేసు నమోదు

టెక్కలి రూరల్: స్థానిక ఆది ఆంధ్రావీధి, కోదండరామవీధులకు చెందిన ఇరువర్గాల మధ్య బుధవారం ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు ఆదిఆంధ్రావీధికి చెందిన యువకుడు, కోదండరామవీధికి చెందిన యువకుడు మధ్య చేపలమార్కెట్ వద్ద చోటుచేసుకున్న వాగ్వివాదం ఇరువర్గాల ఘర్షణకు దారి తీసింది. ఈ మేరకు ఆదిఆంధ్రావీధికి చెందిన పలువురు యవకులు కోదండరామవీధికి వెళ్లి గొడవ చేయడంతో ఆదిఆంధ్రావీధికి చెందిన 11 మందిపై, కోదండరామవీధికి చెందిన ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

బహుమతులు అందజేత

వజ్రపుకొత్తూరు: యూనిట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు పోటీలు, సాంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బుధవారం బహుమతులు అందజేశారు. సంస్థ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా బాతుపురం, పెదవంకలో సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ముగ్గులు పోటీల్లో ప్రదమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా బత్తిని శారద, తెప్పల లక్ష్మి, చెల్లూరు స్వాతి కైవసం చేసుకున్నారు. సాంప్రదాయ వస్త్రధారనలో తామడ సుజాత, చాందిని బహుమతులతో పాటు జ్ఞాపికలను గెలుచుకున్నారు. మరో 20 మందికి బెస్ట్ కన్సలేషన్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సంస్థ గ్రామంలో ఇరవై పార్కింగ్ చైర్స్ ఏర్పాటు చేశారు. గ్రామయువత, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రణస్థలం: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలో కొండములగాం గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కమ్మసిగడాం, కాకిపాలెం ఆడగా కాకిపాలెం విజయం సాధించింది. రన్నర్‌గా కమ్మసిగడాం నిలిచింది. విన్నర్‌కు, రన్నర్‌కు ఎంపిటిసి ప్రతినిధి రెడ్డి వాసు నగదు బహుమతులను అందించారు. క్రమంలో కమ్మసిగడాం, కొండములగాం పంచాయతీ పెద్దలు, సీనియర్ క్రికెటర్లు పాల్గొన్నారు.